# తరలి వెళ్ళాము

"బాబూ, బాబూ, లెగవండి మనమెల్లేసరికి తెల్లారిపోతుంది" అని పిలుస్తున్నారెవరో. మగతగా వున్న నాకు చట్టుక్కున మెలుకువ వచ్చింది. మేము పక్కలు వేసుకున్న అరుగుకి యివతల పందిట్లో పడుకున్న వాళ్ళు ఒకరిద్దరు కదిలారు. పడక్కుర్చీలోంచి ఎవరో లేచారు. శంకరమే! అతను లేచి, వళ్ళు విరుచుకున్నాడు బద్ధకంగా. పక్క నుంచి సన్నగా పడుతున్న దీపం వెల్తురులో, అతని ఆకారం స్పష్టంగా కనుపించింది. అలిసిపోయినట్లుగా విదిలించాడు చేతులు. నా మనస్సు ఎవరో గుప్పిట పట్టినట్లు ఏదో బాధ కలిగింది.

అంతా లేచారు. మరో గంటకి బయలు దేరాము. రెండు బళ్ళలో. సుమిత్ర వాళ్ళ తాతగారి వూళ్ళో. ఆ పల్లెటూళ్ళో చేస్తున్నారు పెళ్ళి. సుమిత్ర ఉత్తరం.ఆ పైన శంకరం వ్రాసిన నాలుగు వాక్యాల ఉత్తరం నన్ను రప్పించాయి యీ పెళ్ళికి. రగ్గు దగ్గరకు లాక్కుని బయటకు చూశాను నేను. మా ముందు నడిచే బండిలో ముగ్గురున్నారు. శంకరం ఉన్నాడు ఆ బండిలో.

లేత బూడిద రంగుగా వున్నదేమిటి యీ వెన్నెల? నా తల్లోని మల్లెపూలు, నా ప్రక్కనున్న బుట్టలోని విచ్చిన పూలు గుండెలలో ఏమిటో కలవరింతలు కలిగిస్తున్నాయి. కలవరింతగా కాకి అరుస్తోంది ఎక్కడో. పంటలు లేని నేల మైదానంలాగా పఱచుకుని ఉన్నది. దారి పక్కన ఆకులు లేని చెట్లు, అస్పష్టమైన ఆకారాల్లో, గీతల్లాంటి కొమ్మలతో కనుపిస్తున్నాయి. నేను బాధగా కళ్ళు మూసుకున్నాను.

నాలుగేళ్ళ క్రితం... యీ వెన్నెల ఎంత మెరుస్తోంది. మిల మిల లాడుతూ లోకమంతా శోభతో నింపి వేసిన వెన్నెల అది. జలతారు పట్టులోంచి, జరీ పోగుల్లోంచి చూస్తున్నట్లుకనుపించాయి ఆ బాట, ఆ మైదానం, ఆ కాలువ ఆ రాత్రి నాకు. వెన్నెల రాత్రంతా యింకా ముందే ఉన్నదప్పుడు. వెండిలాగ మెరుస్తోంది వెన్నెల. చెట్లు మౌనంగా, చల్లగా కనుపిస్తున్నాయి.

ఆనాడు ముందు బండిలోంచి శంకరం పాటలు వినిపిస్తున్నాయి. నా కళ్ళు మూతలు పడసాగాయి. ఎడ్లు నడుస్తోంటే వాటి గిట్టల చప్పుడు, బండి చక్రం గరగరమని ఎండిన రేగటి గడ్డల మీద నడిచిన చప్పుడు. వీటిని మించి ఎడ్ల మెడ పట్టీలలోని పెద్ద మువ్వల చప్పుళ్ళు ప్రశాంతమైన వెన్నెలలో, చలి చలిగా తియ్యగా వున్న వెన్నెలలో, ప్రశాంతతలో కలిసిపోయినాయి యీ శబ్దాలన్నీ. వీటిలోంచే శంకరం గొంతు వినిపించింది.

అంతకు మునుపు నెలరోజుల క్రితం ఎందుకు చెప్పాడు నాకు అవన్నీ? నిజంగా నా సలహా కావలిసేనా? కాలేజీ విడిచాక స్నేహితులు కొరవడ్డ అతనికి అన్నీ చెప్పుకోవడానికి నేను దొరికానేమో! లేక తన మనస్సులో

సుశీలను చేసుకోవాలని ఉన్నప్పటికీ, మరొకళ్ళు కూడా చెబితే బాగుంటుందనుకున్నాడేమో! ఏమో! ఎడ్ల మెడలలోని గంటలు, "ఔను...ఔను.." అన్నట్లు మ్రోగినట్లనిపించాయి.

ఆనాడు శంకరం, కంఠం టెలిఫోనులో నన్ను పలుకరించింది. "మధ్యాహ్నం వచ్చాను వూళ్ళోకి. ఇంటర్వ్యూ వుంది రేపు" అని చెప్పాడు. హాస్టలుకి రమ్మన్నాను అతన్ని.

"ఈ వేళ రాను. ఎంతైనా పరీక్ష కదా! రేపు సాయంత్రం వస్తా. బయటికి ఎక్కడికైనా వెడదాం పర్మిషను తీసుకో" అన్నాడు.

సరేనని నేను ఫోను పెట్టేశాను. చిన్నప్పుడు ఏమంత చనువు లేకపోయినా శంకరం బెనారస్ నుంచి తిరిగి వచ్చాక, బాగా పరిచయం ఏర్పడింది నాకు. క్రిందటి వేసవి సెలవుల్లో నేను మా వూరు వెళ్ళడం, దోవలో శంకరం వాళ్ళింట్లో అనుకోకండా పది, పదిహేను రోజులుండడం జరిగింది. ఆ రోజులలోనే మా బంధుత్వం స్నేహంగా మారింది.

"ఏమైంది పరీక్ష?" అనడిగాను చిరునవ్వుతో మర్నాడు సాయంత్రం.

"జరిగిపోయింది. పోదామా బయటికి? ఈ కోట గోడల మధ్య నాకు తోచదు" అన్నాడతను.

మరో పావుగంటకి, సముద్రం దగ్గర వున్నాము. ఇసుకలో మెల్లిగా అడుగులు వేస్తున్నాడతను కొంచెం ఆగి జేబులోంచి రుమాలు తీసి, కళ్ళజోడు తుడిచి పెట్టుకున్నాడు. రుమాలు మెడకి చుట్టుకుంటూ నా వేపు చూశాడు.

"కూర్చుందామా, అల్లా నడుద్దామా?" అన్నాడు.

"నీయిష్టం" అన్నాను నేను. అతనక్కడే కూర్చున్నాడు. ఎగిరి పోతున్న బెలూన్లు పట్టుకోవడానికి పరుగెత్తుతున్నారు పిల్లలు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలనుకున్నాను" అన్నాడతను. అతని కంఠం సీరియస్‌గా వినిపించింది. ఎందుకని క్రొత్తగా వుంది అంతా నాకు. నిన్న అతని కంఠం ఫోన్‌లో వినపడి నప్పట్నించీ క్రొత్తగానే వుంది.

"చెప్పు" అన్నాను. అతను వెంటనే ఏమీ అనలేదు. కొంచెం ఆగి, "నీకు తెలుసేమో కదూ! అమ్మా, నాన్న నన్నో యింటి వాణ్ని చేయాలని తాపత్రయపడుతున్నారని" నేను తలూపాను. తలవంచి యిసుకలో చూపుడు వ్రేలితో గీతలు గీయసాగాను. మళ్ళీ మౌనం వహించాడతను. నాతో మాట్లాడవలసిందేమిటి అన్న ప్రశ్న నాలోపలే ఆడుతోంది. జవాబు వినాలంటే భయం భయంగా వుంది.

"మీ సుశీల విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అన్నాడతను. ఒడ్డువరకు వచ్చి విరిగిన కెరటంలా ఫీలయ్యాను ఒక్క క్షణంపాటు. ఆ తరువాత ఉరుకులతో, పరుగులతో పరచుకుంటున్న నీటిలాగా నా ఆలోచనలు సాగాయి. "సరిగ్గా వారం క్రిందట మీ మామయ్యే యీ ప్రసక్తి తీసుకు వచ్చారు. సుశీల చాలా అమాయకురాలని అంతా అనుకుంటుంటే విన్నాను. నాలాంటి గడుసువాడితో వేగగలదా అని నా సందేహం." అతను తేలిగ్గా నవ్వాడు యీ మాట అని. నేను కూడా తప్పనిసరిగా నవ్వాను.

"మరేమీ ఫరవాలేదులే. ఈడూ జోడూ సరిపోతుందిలే!" అన్నాను నేను.

చీకటి పడే వరకు అక్కడే వున్నాము. అతను ఎన్నో సంగతులు చెప్పాడు. తన మనస్సు ఎన్ని విధాల, ఎన్న వేపుల మ్రొగ్గుతున్నదీ చెప్పాడు. అన్నిటికీ "ఊ" అనో "ఆ" అనో సమాధానాలిచ్చాను నేను. ఆనాటి సంగతి అది.

అప్పుడు సుశీలకి, శంకరానికి పెళ్ళి అయిన ఆనాడు అంతా తరలి వెళ్ళాము. నేనూ వెళ్ళాను. శంకరం ఒక యింటివాడైనాడు.

కలలా గడిచిపోయిన నాలుగు సంవత్సరాల తర్వాత, ఎన్నో మార్పులు జరిగిన తర్వాత ఒకనాడు సుమిత్ర కంఠం వినిపించింది. "సాయంత్రం మా యింటికి వస్తావా? పిక్చర్‌కి వెడదాం" అని ప్రపోజలు. సరేనన్నాను.

సినిమా హాలులో కూర్చున్న పది నిముషాలకి నావేపు తిరిగిందామె. "నీతో ముఖ్యమైన సంగతి మాట్లాడాలని యిలా ప్రోగ్రాం పెట్టాను"అన్నది.

"సినిమాలోనా"

"ఔను. ఈ చీకట్లో అయితే ఫ్రీగా మాట్లాడగలను నేను" అన్నదామె.

న్యూస్ రీలు మొదలైంది. నా చేతిని ఆమె వ్రేళ్ళు గట్టిగా అదిమాయి. "సుశీల వాళ్ళ వదిన అన్నయ్య వచ్చారు మా యింటికి. సుశీల పోయాక పిల్లవాడు వాళ్ళదగ్గరే వున్నాడు" ఆమె హఠాత్తుగా తెచ్చిన యీ ప్రసక్తి క్రొత్తగా వుంది. అయితే ఆమె ప్రస్తావించబోయేది కూడా చీకట్లో మిణుగురులా స్ఫురించింది నాకు. చాలాసేపు ఎవరం మాట్లాడలేదు. తెరమీద అంతా ఏదో గొడవగా వుంది నాకు. శంకరం ఎవరు, నేనెవరో? ఐతే నేనెందుకు వున్నాను యీ ప్రసక్తిలో?

"వాళ్ళ వదిన అడిగింది నన్ను... అతని విషయం. సుశీల పోయి ఏడాది తిరక్కుండా యీ మాటలేమిటన్నాను నేను" ఆగింది సుమిత్ర. తల వంచి కళ్ళమీద చేతులుంచుకుంది ఆమె.

"కానీ కొంచెం ఆలోచిస్తే, యిప్పుడే విపరీతంగా వంటరి తనం అనిపిస్తుందేమో అతనికి. ఎంత బాధ నిజంగా! అతని గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అన్నది.

నేను వెంటనే జవాబివ్వలేదు. "నీకు కూడా పరిచయమేగా అతను? నేనేం చెప్పగలను" అన్నాను.

"అల్లా కాదు. నాకున్నది ముఖ పరిచయమే. నీకు బంధుత్వం, స్నేహం కూడా వున్నాయి. నా మనస్సుని నువ్వే సమాధానపఱచగలవు" ఆమె కంఠం వణికింది.

"మంచి వాడు సుమిత్రా అతను. అతనికి ప్రేమించే శక్తి వుంది" అన్నాను నేను. నేను అనవలసినది అదే కనుక అన్నాను.

పర్యవసానంగా యిప్పుడు... మరోసారి శంకరం, సుమిత్ర పెళ్ళికి తరలి వెడుతున్నాము. వెన్నెలంతా ముందే వున్న మెరిసే రాత్రి కాదది. మెరుపు పోయి, దిగులుగా, లేచీకటిలో తడిసిన తెల్లవారు ఝూమున కాసే వెన్నెలిది.

.... నేను కళ్ళు మూసుకున్నాను. నా వెనుకనుంచి సన్నని చప్పుడు. కొండల మధ్య, చెట్ల మధ్య జలజలమని ప్రవహిస్తున్న సెలయేరు చేసే చప్పుడు వినిపిస్తోంది. ఆ సెలయేరు నా వెనుకనుంచి వచ్చి నా ప్రక్కగా నన్ను ఒరుసుకుంటూ, నా మీద తుప్పర్లు జల్లి అల్లా వెళ్ళిపోయింది. నా ప్రక్కనుంచి, నా ప్రక్కనుంచే మరో సన్నని కాలువ మంద మంద్రంగా ప్రవహిస్తూ ముందుకు పోతూ, ఎక్కడో దూరంగా, నా చూపుకి అందని దూరంలో ఆ సెలయేటిలో కలిసిపోతోంది.

నేను... నేను యిక్కడే... యీ గుడ్డి వెన్నెలలో వంటరిగా వున్నాను.